క్లుప్తంగా

నేటి తరానికి చంద్రశేఖర్ ఆజాద్ స్ఫూర్తి

పెనుగొలను(గంపలగూడెం): మండలంలోని పెనుగొలనులో షిర్డీసాయిబాబా సేవాసమితి ఆధ్వర్యంలో మంగళవారం స్వాతంత్య్ర సమర యోధుడు, విప్లవవీరుడు చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘననివాళి అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణాలను తృణప్రాయంగా త్యజించిన గొప్పవ్యక్తి చంద్రశేఖర్‌ఆజాద్ అని కొనియాడారు. నేటి యువత ఆయన్ను ఆదర్శంగా తీసుకొని పనిచేయాలన్నారు. సేవాసమితి సభ్యులు ఊటుకూరు యజ్ఞకృష్ణ, కే రామారావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చూర్ణోత్సవం



తిరువూరు: స్థానిక శ్రీ వేంకటాచల స్వామి ఆలయంలో తిరుకల్యాణ మహోత్సవాల్లో మంగళవారం చూర్ణోత్సవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నిత్య హోమం, బలిహరణ, విశేషపూజలు, తీర్థగోష్టి అనంతరం సంప్రదాయబద్ధంగా చూర్ణోత్సవం కార్యక్రమాలను జరిపారు. బుధవారం పవళింపు సేవతో ఈ ఉత్సవాలు ముగుస్తాయని అర్చకులు తెలిపారు. ఆలయ అర్చకులు దేవయాజనం వేణుగోపాల కృష్ణమాచార్యులు, దివి ఉదయకుమారాచార్యులు ఈ ఉత్సవాల నిర్వహణలో పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణపై కళాజాతా



నూజివీడు: జాతీయ ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధి నివారణపై మంగళవారం అన్నవరం, బోర్వంచల గ్రామాల్లో కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎయిడ్స్ నివారణ, నిర్మూలనకై తీసుకోవలసిన జాగ్రత్తలపై కళాకారులు అవగాహన కల్పించారు. హెచ్ఐవీ నిర్ధారణకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అర్బన్ హెల్త్ కేంద్రం, ఏరియా ఆసుపత్రులలో ఏర్పాటు చేసిన ఐసీటీసీ కేంద్రాలకు వెళ్లి రక్త పరీక్ష చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే సీడీ ఫోర్ కౌంట్‌తో సంబంధం లేకుండా ఏఆర్టీ మందులు వాడాలని అవగాహన కల్పించారు. 1097 టోల్ ఫ్రీ నంబర్ హెచ్ఐవి 2017 యాక్ట్, ఎన్ఏసీఓ యాప్ డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. కళాభారతి సంస్థ తరుపున కళాకారులు ఎం.ప్రసాద్, ఎం.తిరుపతి, ఎం.నాగేంద్ర, ఎం.విజయ్‌కుమార్, వై.రాము, బీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు పటిష్ట చర్యలు

ఎస్పీ డి.మేరీ ప్రశాంతి



ఏలూరు టౌన్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకొనేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఎస్పీ డి.మేరీ ప్రశాంతి అన్నారు. నూజివీడు డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన గోలి లక్ష్మయ్య ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మేరీ ప్రశాంతి మాట్లాడుతూ నూజివీడు సబ్ డివిజన్ ప్రధానంగా అంతర్ రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలతో కలుస్తూ ఉన్న నేపథ్యంలో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలోకి ఇతర రాష్ట్రాల నుంచి మద్యం, నాటుసారా అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. నిత్యం వాహన తనిఖీలు చేస్తూ నగదు అక్రమ రవాణాను అడ్డుకోవాలని సూచించారు.

1న ఎల్బీఆర్‌సీఈలో లక్ష్య-2కే24

మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మార్చి ఒకటో తేదీన 17వ జాతీయ స్థాయి టెక్నికల్, కల్చరల్ ఫెస్టివల్(లక్ష్య-2కే24) నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా జమ్‌షెడ్‌పూర్ హెక్సావేర్ టెక్నాలజీస్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ విభాగాధిపతి సొగత సేన్ పాల్గొంటారన్నారు. నార్త్, సౌత్ ఫౌండేషన్, యూఎస్ఏ లయజన్ ఫర్ విజయవాడ చాప్టర్ శ్రీలత మేక, ఎల్బీఆర్‌సీఈ ట్రస్టీ, ప్రవాసాంధ్రులు డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి, ఎల్బీఆర్‌సీఈ చైర్మన్, ప్రవాసాంధ్రులు లకిరెడ్డి ప్రసాదరెడ్డి, వైస్ చైర్మన్ లకిరెడ్డి విజయ్‌కుమార్‌రెడ్డి, లకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వరలక్ష్మి వేమిరెడ్డి, పేట్రన్‌లుగా కళాశాల ప్రెసిడెంట్ జీ శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే హరినాథరెడ్డి పాల్గొంటారన్నారు.

ముమ్మరంగా జల్‌జీవన్

- తాగునీరిచ్చేందుకు వందలకోట్లు ఖర్చు
- నాడు వైఎస్సార్.. నేడు వైఎస్ జగన్ కృషి
- నియోజకవర్గంలో జల్‌జీవన్ మిషన్ కింద కొనసాగుతున్న పనులు



కృష్ణావాటర్ పైపులైన్ రెండోదశ పనులు పూర్తి చేసి.. నాడు వైఎస్సార్ పారంభించిన కుంటముక్కల పంప్‌హౌస్



జి.కొండూరు బైపాస్ వై జంక్షన్ వద్ద కృష్ణవాటర్ మెయిన్‌లైన్‌కు నూతనంగా ఏర్పాటు చేస్తున్న పైపులు

జి.కొండూరు: మైలవరం నియోజకవర్గ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది. నియోజకవర్గంలో 2019 నుంచి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాగునీటి సరఫరా కోసం వందల కోట్లు ఖర్చు చేస్తోంది. జల్‌జీవన్ మిషన్ పనులు కూడా ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు ఆర్‌డబ్ల్యూఎస్ కింద 688 పనులకు రూ.197.79 కోట్లను కేటాయించగా 60 శాతం పనులు కొనసాగుతున్నాయి.

నాడు వైఎస్సార్..

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న 2004–09 మధ్య కాలంలో నియోజకవర్గంలోని పలు గ్రామాలకు తాగునీరిచ్చేందుకు కృష్ణావాటర్ పైపులైన్ రెండో దశ విస్తరణ పనులను పూర్తి చేశారు. అప్పటికే కృష్ణాజలాలు ఇబ్రహీంపట్నం నుంచి జి.కొండూరు వరకు అందించేందుకు గత ప్రభుత్వం మొదటి దశ పనులను పూర్తి చేసింది. కానీ మైలవరం, రెడ్డిగూడెం మండలాలకు కూడా తాగునీరు అందించాలనే లక్ష్యంతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రూ.5 కోట్లు కేటాయించి రెండో దశ పనులను పూర్తి చేశారు. జి.కొండూరు నుంచి చెవుటూరు, వెంకటాపురం, కుంటముక్కల, గుర్రాజుపాలెం మీదుగా మైలవరం వరకు 12 కి.మీ పైపులైను ఏర్పాటు చేసి పంపుహౌస్‌ను నిర్మించారు. జి.కొండూరు నుంచి ఆత్కూరు, ముత్యాలంపాడు, కందులపాడు, కొల్లేటిగూడెం, వెలగలేరు వరకు ఏడు కిలోమీటర్లు పైపులైను ఏర్పాటు చేశారు. చెర్వుమాధవరం నుంచి సున్నంపాడు, తెల్లదేవరపాడు, గంగినేని గ్రామాల మీదుగా దుగ్గిరాలపాడు వరకు ఏడు కిలోమీటర్లు పైపులైను ఏర్పాటు చేయడంతో పాటు మూడు పంపుహౌస్‌లు నిర్మించి ఆయా గ్రామాలకు తాగునీరందించారు. కందులపాడు నుంచి వెల్లటూరు వరకు మూడు కిలోమీటర్లు పైపులైను ఏర్పాటు చేసి వెల్లటూరు గ్రామానికి కూడా కృష్ణాజలాలను అందించారు. కృష్ణావాటర్ పైపులైను రెండో దశ పనులతో పాటు కుంటముక్కల గ్రామ సమీపంలో నిర్మించిన 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్, తారకరామ ఎత్తిపోతల రెండో దశ పనుల పూర్తి చేసి 2006 మే నెల 10వ తేదీన ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించారు.

నేడు సీఎం వైఎస్ జగన్..

వైఎస్ రాజశేఖరరెడ్డి తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియోజకవర్గ ప్రజలకు తాగునీరందించేందుకు రూ.వందల కోట్లు కేటాయించడంతో పాటు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చెరో 50 శాతం భాగస్వామ్యంతో జల్‌జీవన్ మిషన్ కింద ఇంటింటికీ కుళాయి ఇచ్చేందుకు పనులను ప్రారంభించారు.

ముమ్మరంగా జల్‌జీవన్ మిషన్ పనులు

మైలవరం నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో 62 గ్రామ పంచాయతీలు ఉండగా జి.కొండూరు మండలంలో ఎనిమిది గ్రామాలు, ఇబ్రహీంపట్నం మండలం లో పది గ్రామాలు, మైలవరం మండల పరిధిలో ఏడు గ్రామాలు, రెడ్డిగూడెం మండలంలో తొమ్మిది గ్రామాలు, విజయవాడ రూరల్ మండల పరిధిలో రెండు గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ కింద రూ.12 కోట్లతో పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు ఈ పథకం కింద రెండు వేలకు పైగా ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇచ్చారు.

నియోజకవర్గంలో కుటుంబాలు, వాటర్ కనెక్షన్లు, ఏర్పాటు చేయవలసిన కనెక్షన్‌ల వివరాలు..

మండలం	పంచాయతీలు	కుటుంబాలు	ఉన్న వాటర్ కనెక్షన్‌లు	ఏర్పాటు చేయవలిసినవి
జి.కొండూరు	22	15105	7369	7736
మైలవరం	13	20061	10142	9919
రెడ్డిగూడెం	12	13812	9777	4035
ఇబ్రహీంపట్నం	10	12338	6974	5364
విజయవాడ రూరల్	5	11413	5544	5869

మైలవరం నియోజకవర్గంలో 2019–24వరకు ఆర్‌డబ్ల్యూఎస్ కింద కేటాయించిన పనుల వివరాలు..

మండలం	పనులు	నిధులు (రూ.కోట్లలో)
జి.కొండూరు	144	69.44
మైలవరం	128	33.37
రెడ్డిగూడెం	156	26.73
ఇబ్రహీంపట్నం	193	42.70
విజయవాడరూరల్	67	25.53

జల్‌జీవన్ మిషన్ కింద నియోజకవర్గానికి మంజూరైన పనులు, నిధుల వివరాలు

మండలం	పనులు	నిధులు (రూ.కోట్లలో)
జి.కొండూరు	66	57.06
మైలవరం	56	21.74
రెడ్డిగూడెం	68	14.51
ఇబ్రహీంపట్నం	53	18.03
విజయవాడరూరల్	29	16.34

తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి



మైలవరం నియోజకవర్గంలోని ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారించాం. పైపులైన్ల మరమ్మతులు, అవసరమైన చోట కొత్త పైపులైన్ల ఏర్పాటు, ట్యాంకులు, సంపుల నిర్మాణం వంటి పనులను సమర్ధవంతంగా చేస్తున్నాం. కృష్ణావాటర్ సరఫరాపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుంది. జల్‌జీవన్ మిషన్ కింద పనులు కొనసాగుతున్నాయి.

–ధనేకుల శ్రీనివాసరావు, డీఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్, మైలవరం సబ్‌డివిజన్

నేడు ఎమ్మెల్యే పర్యటన

ఆగిరిపల్లి: ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించనున్న అభివృద్ధి పనులు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొంటారని ఎంపీడీవో శామ్యూల్ తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

రేపు నూతన భవనం ప్రారంభోత్సవం

నూజివీడు: పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో రోగుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం రూ.25 కోట్లతో నిర్మించిన జీ+3 భవనాన్ని ఈనెల 29న రాష్ట్ర మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పినిపే విశ్వరూప్ ప్రారంభించనున్నారు. ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అధ్యక్షతన నిర్వహించే ఈ కార్యక్రమంలో ఎంపీ కోటగిరి శ్రీధర్, వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు పాల్గొంటారని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరాయి.

20 మందికి యాంజియోగ్రామ్ పరీక్షలు



రెడ్డిగూడెం: కృష్ణామిల్క్ యూనియన్, వరుణ్ కార్డియాక్ అండ్ న్యూరో సైన్సెస్ సంయుక్త ఆధ్వర్యంలో మైలవరం క్లస్టర్ పరిధిలో ఇటీవల జరిగిన గుండె పరీక్షలలో మండలంలోని రాఘవాపురం, బూరుగగూడెం గ్రామాల్లో పాడి రైతులు 20 మందికి ఉచితంగా యాంజియోగ్రామ్ పరీక్షలు నిర్వహించారు. కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు పాడి రైతులతో మాట్లాడారు. ఇంతటి బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టినందుకు పాడి రైతులు చలసాని ఆంజనేయులు, కార్డియాక్ డాక్టర్ గుంటూరు వరుణ్‌లకు ధన్యవాదలు తెలిపారు.

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తేనే భవిష్యత్తు బాగు

వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు



కీర్తిరాయుని గూడెంలో మాట్లాడుతున్న సర్నాల తిరుపతిరావు

కీర్తిరాయునిగూడెం (మైలవరం): వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తే మన బిడ్డల భవిష్యతు బాగుంటుందని, మన భవిష్యత్తుకు మనమే పునాదులు వేసుకుందామని వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు అన్నారు. మైలవరం మండలం కీర్తిరాయునిగూడెం గ్రామంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం మంగళవారం నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు గడప గడపకు తిరుగుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గ్రామస్తులకు వివరించారు. మరోసారి జగనన్నను అధికారంలోకి తీసుకువస్తే ఇప్పటి వరకు కొనసాగుతున్న సంక్షేమ పథకాలు అమలు అవుతాయన్నారు. ముఖ్యమంత్రి జగన్ పరిపాలనలో నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చేశారని, ఇంటి వద్దకే వైద్యం అందుతోందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా అదనపు ఖర్చు లేకుండా రైతులకు విత్తనాలు, ఎరువులు, మందులు గ్రామంలోనే అందుబాటులోకి తీసుకవచ్చిన ఘనత మన ముఖ్యమంత్రిదే అన్నారు. ఒక సామాన్యుడిని జెడ్పీటీసీ స్థాయి నుంచి నియోజకవర్గ ఇన్‌చార్జి చేయడం జగనన్నకు చెల్లిందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

బలివేలో ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన

మునునూరు: భక్తులకు కల్పించే సౌకర్యాలే ఉత్సవాలకు విజయాన్నిస్తాయని నూజివీడు నూతన డీఎస్పీ జి.లక్ష్మయ్య అన్నారు. బలివేలోని మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను మంగళవారం సాయంత్రం అధికారులతో కలసి పరిశీలించారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగుల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో డీఎస్పీకి స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామిని దర్శించుకుని, ఆలయ, ఉత్సవ ప్రాంగణాల్లో ఏర్పాట్లు పరిశీలించారు. ఉత్సవ ప్రాంగణం, స్నాన ఘట్టాలను పరిశీలించారు. భక్తులకు అన్ని సౌకర్యాలు, పటిష్టమైన భద్రత కల్పించాలని ఎస్ఐ వాసును ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్, ప్రధానార్చకులు తోలేటి అరుణభాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

మైనారిటీ తీరకుండా వివాహాలు చేయొద్దు

ఆర్డీవో మాధవి



తిరువూరులో ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్డీవో మాధవి

తిరువూరు: యుక్తవయసు రాగానే ఆడపిల్లలకు పెళ్లి చేయాలనే తలంపును తల్లిదండ్రులు విడనాడాలని తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారిణి కే మాధవి సూచించారు. తిరువూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మంగళవారం కిశోరబాలికల సమస్యలపై అవగాహన కల్పిస్తూ ప్రదర్శన, సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆర్డీవో మాధవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన తర్వాతే ఆడపిల్లలకు పెళ్లి చేయాలని, మైనర్ బాలికల పెళ్లి చట్టరీత్యా నేరమన్నారు. ఆడపిల్లలను సాధ్యమైనంత వరకు చదువుకునేందుకు ప్రోత్సహించాలని, తమను తాము రక్షించుకునే, పోషించుకునే నైపుణ్యాలను నేర్పాలని సూచించారు. తెలిసీ తెలియని వయసులో కిశోరబాలికలు చేసే పొరపాట్లను సరిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు. తిరువూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో సత్యవతి మాట్లాడుతూ కిశోరబాలికలపై వేధింపులకు పాల్పడినా, మైనారిటీ తీరని బాలికలకు పెళ్లి చేసినా నేరమన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు ద్వారా బాలికలకు కల్పిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోరబాలికలు పాల్గొన్నారు.

నామినేషన్ల ప్రక్రియ ముగిసే వరకు ఓటు నమోదు

ఆర్డీఓ భవానిశంకరి



రాజకీయ పార్టీల నాయకులకు సూచనలు చేస్తున్న ఆర్డీఓ భవానీశంకరి

నూజివీడు: వచ్చే ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ముగిసే వరకు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ఆర్డీఓ వై.భవానీశంకరి తెలిపారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఎన్నికల నిర్వహణపై మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రాబోయే ఎన్నికలను నియోజకవర్గంలో ప్రశాంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలన్నీ సహకరించాలన్నారు. పట్టణంలోని పీఏసీఏస్‌లో ఉన్న పోలింగ్ స్టేషన్‌ను ఓటర్ల సౌకర్యార్థం భువనగిరిపేటలోకి మారుస్తున్నామన్నారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ప్రతి పోలింగ్ స్టేషన్‌లో సదుపాయాలను కల్పిస్తామన్నారు. ఇప్పటికే అధికారులు అన్ని పోలింగ్ స్టేషన్లను పరిశీలించామని తెలిపారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లలో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. పలువురు రాజకీయ నాయకులు మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్ లోపల ఈవీఎంలు ఏర్పాటు చేసే దగ్గర గుర్తులు కనిపించేలా లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. వృద్ధులు, వికలాంగులు పోలింగ్ స్టేషన్‌లోకి వెళ్లేందుకు వీలుగా ర్యాంప్‌లు నిర్మించాలని సూచించారు. పట్టణంలో విచ్చలవిడిగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారని, దీని వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆర్డీఓ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి ఆమె బదులిస్తూ నోటిఫికేషన్ వచ్చిన తరువాత ఫ్లెక్సీలన్నింటినీ తొలగిస్తామని చెప్పారు. ఎన్నికల నిర్వహణలో అందరూ సహకరించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి, నూజివీడు తహసీల్దార్ ఏవీ శాస్త్రి, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం ప్రభుత్వ లక్ష్యం

మునునూరు: జగనన్న ఆరోగ్య సురక్షతో పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం వారి ముంగిట్లోనే అందుతుందని ఎంపీపీ కొండా దుర్గాభవాని అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష నోడల్ అధికారి, ఎంపీడీఓ సీహెచ్ పద్మావతీదేవి ఆధ్వర్యాన మంగళవారం చెక్కపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు కరీముల్లా, ప్రత్యేక వైద్యులు ప్రవీణ్, రవళి 572 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. నలుగురిని మెరుగైన వైద్యం కోసం నూజివీడుకు రిఫర్ చేశారు. 100 మందికి నేత్ర పరీక్షలు చేశారు. స్థానిక ఎంపీటీసీ తోట రమాదేవి 44 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పేదలు వినియోగించుకోవాలని ఎంపీటీసీ కోరారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ నేత టి.మురళీకృష్ణ వైద్య శాఖ, సచివాలయ, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

356 మందికి వైద్య పరీక్షలు

చాట్రాయి: మండలంలోని తుమ్మగూడెం గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 356 మంది రోగులకు వైద్యులు షేక్ ఆజాద్(చెవి, ముక్కు, గొంతు), ఆర్.రఘువీర్ (చర్మ వ్యాధులు) పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మొలుగుమాటి మారమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు మాదల నరశింహారావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఉచితంగా మెరుగైన వైద్యం

పుట్రేల (విస్సన్నపేట): పేదలకు ఉచితంగా మెరుగైన వైద్యసేవలు అందించేందుకే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ కారుమంచి స్వాతి అన్నారు. మండలంలోని పుట్రేల గ్రామ సచివాలయం–1 వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం రెండో విడత కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వైద్యులు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. మన గ్రామంలోనే ఈ విధంగా వైద్యసేవలు అందించటం పేద ప్రజలకు ఎంతో ఉపయోగం అన్నారు. పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని స్వాతి అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహామండలి జిల్లా చైర్మన్ దోర్నాల దామోదరరెడ్డి, డాక్టర్ అశ్వినీదత్, పంచాయతీ కార్యదర్శి మురళి పాల్గొన్నారు.



చెక్కపల్లిలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు



తుమ్మగూడెంలో రోగిని పరీక్షిస్తున్న డాక్టర్



పుట్రేల గ్రామంలో మెడికల్ కిట్ అందజేస్తున్న సర్పంచి స్వాతి, దామోదరరెడ్డి

అసోసియేషన్ కార్యాలయం ప్రారంభం



ఇబ్రహింపట్నం ఎ-కాలనీలో అసోసియేషన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నవీన్ గౌతమ్

ఇబ్రహీంపట్నం(మైలవరం): ఉద్యోగులు, కార్మికులు తమ సమస్యలు పరిష్కరించుకోవడడానికి అసోసియేషన్ కార్యాలయం ఒక మంచి వేదిక అవుతుందని ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ పి.నవీన్‌గౌతమ్ తెలిపారు. ఇబ్రహీంపట్నం ఏపీఎస్ఈబీ (డాక్టర్ ఎన్‌టీటీపీఎస్) ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయాన్ని ఇబ్రహీంపట్నం–ఎ కాలనీలోని ఎస్ఆర్‌టీ క్వార్టర్స్‌లో చీఫ్ ఇంజినీర్ నవీన్ గౌతమ్ మంగళవారం ప్రారంభించారు. రాష్ట్ర కార్యాలయాన్ని విజయవాడలో నిర్మించుకోవడానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ చీఫ్ ఇంజినీర్ ఎస్.నాగభూషణరావు మాట్లాడుతూ బాబా సాహెబ్ అంబేడ్కర్ చూపిన మార్గంలో నడుచుకుంటూ ఆయన ఆశయ సాధన కోసం ఉద్యోగులంతా ఐక్యంగా కృషి చేయాలన్నారు. అసోసియేషన్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఏవీ కిరణ్ మాట్లాడుతూ ఇక ముందు రాష్ట్ర కార్యకలాపాలు కూడా ఈ కార్యాలయం నుంచే జరుగుతాయన్నారు. అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ఉన్నవ వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో మార్చి 2వ తేదీన గుంటూరులో జరగబోయే దళిత కవి, ఉద్యమ నాయకులు కత్తి పద్మారావు సంఘీభావ సభకు సంబందించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా సంక్షేమ లబ్ధి



చాట్రాయి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఏపీ కో ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి తెలిపారు. మంగళవారం రాత్రి మండలంలోని బూరుగుగూడెం గ్రామంలో నిర్వహించిన వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ వారి అభివృద్ధికి దోహదపడుతున్నారని దేశిరెడ్డి చెప్పారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే పేదవాడికి అందే సంక్షేమ పథకాలు రద్దు అవుతాయని అన్నారు. గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి తేడాను గమనించి రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించి మరోసారి వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకుందామని ఆయన పిలుపు ఇచ్చారు.

మున్సిపల్ కమిషనర్ బదిలీ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపల్ కమిషనర్‌గా రెండేళ్లుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సీహెచ్ వెంకటేశ్వర్లును చీరాలకు బదిలీ చేస్తూ మంగళవారం రాష్ట్ర మున్సిపల్ శాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయన స్థానంలో మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో పరిపాలనాధికారిగా పనిచేస్తున్న శంకర్‌నాయక్‌ను మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు.